కాంగ్రెస్ నేతల హౌస్ అరెస్టు

ముషీరాబాద్: సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలపై ఈడీ పెట్టిన అక్రమ కేసులు నిరసిస్తూ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో శనివారం చేపట్టిన చలో ఈడీ కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి అరవింద్‌కుమార్‌యాదవ్‌ను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అక్రమ కేసులు వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో తమ పోరాటం మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.

బోయిన్‌పల్లి పీఎస్‌కు యూత్ కాంగ్రెస్ నేతల తరలింపు

కంటోన్మెంట్: శాంతియుతంగా నిరసనలు చేస్తున్న యూత్ కాంగ్రెస్ నేతలను అరెస్టు చేయడం అన్యాయమని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా గాంధీ, రాహుల్ గాంధీ పేర్లను చేర్చడాన్ని నిరసిస్తూ ధర్నా చేస్తున్న యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి, ఇతర నేతలను పోలీసులు అదుపులోకి తీసుకుని బోయిన్‌పల్లి స్టేషన్‌కు తరలించారు. వారిని ఎమ్మెల్యే శ్రీగణేశ్ పరామర్శించారు.

'గ్రూప్-1 పరీక్షను రద్దు చేసి తిరిగి నిర్వహించాలి'

ఉస్మానియా యూనివర్సిటీ: గ్రూప్-1 పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని నవతరం స్టూడెంట్ ఫెడరేషన్ (ఎన్ఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు నీరటి రామ్ ప్రసాద్ పటేల్ శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం నిర్వహించిన గ్రూప్-1, 2, 3, 4 పరీక్షల నిర్వహణలో అవినీతి అక్రమాలు జరిగాయని గగ్గోలు పెట్టిన కాంగ్రెస్ ప్రస్తుతం అధికారం చేపట్టిన తర్వాత పరీక్షల నిర్వహణలో విఫలమైందన్నారు. గ్రూప్-1 రద్దు చేసి తిరిగి పరీక్షలు నిర్వహించాలని లేకుంటే బీఆర్ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కు పడుతుందని హెచ్చరించారు.


ఓయూలో నిరవధిక సమ్మె

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ కాంట్రాక్టు అధ్యాపకులు నిరధిక సమ్మె శనివారం ప్రారంభమైంది. క్యాంపస్‌లోని పాలన భవనం ఎదుట టెంట్‌కు అనుమతి ఇవ్వకపోవడంతో ప్రవేశ ద్వారం వద్ద అధ్యాపకులు బైఠాయించి మొదటి రోజు సమ్మె చేశారు. రాష్ట్రంలోని 12 వర్సిటీల్లో బడ్జెట్, సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులు బోధిస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను పర్మనెంట్ చేయాలని ఆందోళనలు చేపట్టిన ప్రభుత్వం స్పందించకపోవడంతోనే తరగతులు బహిష్కరించి సమ్మెకు దిగినట్లు అధ్యాపకులు తెలిపారు. ఓయూ క్యాంపస్ కాలేజీతో పాటు నిజాం, సికింద్రాబాద్, సైఫాబాద్, జిల్లా పీజీ కాలేజీలు, వీర నారి చాకలి ఐల్లమ్మ మహిళా వర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకులు సమ్మెలో కూర్చున్నారు. కార్యక్రమంలో డా.ఉపేందర్, డా.సీమర్ల విజేందర్ రెడ్డి, డా.పరశురాం, డా.వేల్పుల కుమార్, డా.తాళ్లపల్లి వెంకటేష్, డా.పాండేయ్య, డా.రేష్మారెడ్డి, డా.వినత పాండే, డా.కృష్ణయ్య, డా.హెచ్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఓయూ ఇంజినీరింగ్ విద్యార్థులకు ఉద్యోగాలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఇంజినీరింగ్ కాలేజీలోని నలుగురి విద్యార్థులకు అంతర్జాతీయ కంపెనీల్లో ఉద్యోగాలు లభించాయి. సునందకు అమెజాన్ కంపెనీలో ఏడాదికి రూ.45 లక్షల ప్యాకేజీ, జుస్‌పే కంపెనీలో ఐరాజ్ ఫాతీమాకు రూ.27 లక్షలు, మహ్మద్ ఆరీఫ్‌కు దిషో కంపెనీలో మహ్మద్ అరీఫ, ఎస్‌ఏ నదీమ్‌కు రూ.24.85 లక్షల ప్యాకేజీతో ఉద్యోగాలు వచ్చాయని అధికారులు తెలిపారు. దీంతో వారిని వీసీ ప్రొ.కుమార్ అభినందించారు.

హత్యకేసు నిందితుడి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

ముషీరాబాద్: అప్పు ఇచ్చి డబ్బులు అడిగిన పాపానికి ఓ ఫైనాన్సర్‌ను కత్తితో దారుణంగా హత్య చేసి పరారైన నిందితుడిని ముషీరాబాద్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈనెల 4వ తేదీన ముషీరాబాద్ పీఎస్ పరిధిలో నమోదైన ఫైనాన్స్ వ్యాపారి సత్నంసింగ్(59) ఇటీవల నయన్ చంద్రానాయక్ చేతిలో హత్యకు గురయ్యారు. మృతుడి ఫోన్ చివరి సిగ్నల్ ఆధారంగా సత్నంసింగ్ అప్పు తీర్చమని నయన్‌చంద్రానాయక్ ఇంటికి వెళ్లగా అతడు సత్నంసింగ్‌ను హత్య చేసి సంపులో పడేశాడు. అంతకు మృతుడి మెడలోని నగలను తీసుకొని ఒరిస్సాకు పరారయ్యాడు. అక్కడ నుంచి గోవాకు పారిపోయి గోవాలోనే నగలు అమ్మేసి డబ్బులు అయిపోయాక తిరిగి శనివారం 19 మధ్యాహ్నం సికింద్రాబాద్‌కు చేరుకున్నాడు.

◆ హత్యకు జరిగిన నాటి నుంచి నయన్ చంద్ర నాయక్‌పై నిఘాపెట్టిన పోలీసులు అతడి సెల్ ఫోన్ సిగ్నల్ ఆధారంగా పట్టుకునేందుకు సన్నద్ధమయ్యారు. గోవా నుంచి సికింద్రాబాద్‌కు చేరుకున్నట్లు ఫోన్ సిగ్నల్ ద్వారా సమాచారం అందుకున్న ముషీరాబాద్ పోలీసులు అతడిని అరెస్టు చేసి శనివారం సాయంత్రం రిమాండ్‌కు తరలించారు. ఈ కేసును సెంట్రల్ జోన్ డీసీపీ శిల్పవల్లి, చిక్కడపల్లి ఏసీపీ ఎల్.రమేష్‌కుమార్ పర్యవేక్షణలో సీఐ రాంబాబు ఆధ్వర్యంలో దర్యాప్తు సాగిస్తున్నారు. ఈ కేసును చేదించి నిందితుడిని అరెస్టు చేసిన పోలీసు సిబ్బందిని డీసీపీ, ఏసీపీలు అభినందించారు.

'డబుల్' లిఫ్ట్ ట్రబుల్



- లంబాడీ తండాలోని డబుల్ బెడ్‌రూమ్ సముదాయంలో పనిచేయని లిఫ్ట్‌లు
- ఇబ్బందులకు గురవుతున్న వృద్ధులు, పిల్లలు, మహిళలు





సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఎంతో గంపెడు ఆశతో ప్రభుత్వం నిర్మించి ఇచ్చిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలోకి అడుగుపెట్టిన లంబాడీ తండా వాసులకు నిరాశ మిగిలింది. అక్కడ అడుగుపెట్టిన ప్రారంభం నుంచి ఏదో ఒక సమస్యతో సతమతమవుతున్నారు. డ్రైనేజీ పొంగడం, లిఫ్ట్ రిపేర్‌కు రావడం తదితర సమస్యలతో బాధపడుతున్నారు. అయితే పది రోజుల నుంచి రెండు లిఫ్ట్‌లు పనిచేయకపోవడంతో తండా వాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. 2001లో నాటి మంత్రి కేటీఆర్, నాయిని నర్సింహారెడ్డి చేతుల మీదుగా ప్రారంభమైన ఈ డబుల్ బెడ్‌రూమ్‌లలో అన్ని సమస్యల వలయంగా మారింది.

◆ ప్రభుత్వం నిర్మించి ఇచ్చిన ఈ బిల్డింగ్‌లో 9 ఫ్లోర్లు ఉన్నాయి. ఇందులో సుమారు వేయిమంది వరకు నివసిస్తున్నారు. లిఫ్ట్ పనిచేయకపోవడంతో ఇందులో ఉన్న చిన్న పిల్లలు, వృద్ధులు, వికలాంగులు, తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నాసిరకం లిఫ్ట్‌లను ఏర్పాటు చేయడంతో అనేక మార్లు మరమ్మతులు చేయించినా ప్రయోజనం లేకుండా పోయిందని తండా వాసులు చెబుతున్నారు. ఇప్పటి వరకు లక్ష రూపాయల వరకు మరమ్మతులకే ఖర్చు అయ్యిందని పేర్కొన్నారు. తాము ఈ ఖర్చులను భరించలేకపోతున్నామని తెలిపారు.

◆ లిఫ్ట్‌లు పనిచేయకపోవడంతో కింద నుంచి పైకి.. పై నుంచి కిందకి వృద్ధులు, వికలాంగులు వెళ్లలేక బంధువుల ఇంటికి వెళ్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నాణ్యమైన లిఫ్ట్‌లను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. శుక్రవారం సీనియర్ కాంగ్రెస్ నాయకులు అరవింద్ యాదవ్ డబుల్ బెడ్‌రూమ్‌లను సందర్శించి వారికి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

ఇబ్బంది పడుతున్నాం



పది రోజులుగా లిఫ్ట్‌లు పని చేయడం లేదు. తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వృద్ధులు, వికలాంగులు, చిన్న పిల్లలు పడే అవస్థ అంతా ఇంత కాదు. అనేక మార్లు సంబంధిత అధికారులకు మొరపెట్టుకున్నా ప్రయోజనం లేకుండా పోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి న్యాయం చేయాలి.

– నవీన్ నాయక్, తండావాసీ

కొత్త లిఫ్ట్‌లు ఏర్పాటు చేయాలి



పాతలిఫ్ట్‌లు సక్రమంగా పనిచేయడంలేవు. కొత్తలిఫ్ట్‌లు ఏర్పాటు చేయాలి. అనేక మార్లు మరమ్మతులు చేయించిన ప్రయోజనం లేకుండా పోయింది. సుమారు లక్షరూపాయల వరకు ఖర్చు అయ్యింది. లిఫ్ట్ మదర్ బోర్డు పూర్తిగా ధ్వంసం అయ్యింది. అందువల్ల కొత్త లిఫ్ట్ ఏర్పాటు చేయాలి.

– వి.సంతోష్

స్లాట్ బుకింగ్ విధానాన్ని రద్దు చేయాలి

చిక్కడపల్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట డాక్యుమెంట్ రైటర్ల ఆందోళన

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రభుత్వం తీసుకొచ్చిన స్లాట్ బుకింగ్ విధానాన్ని రద్దు చేయాలని శనివారం అశోక్‌నగర్‌లోని చిక్కడపల్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట డాక్యుమెంట్ రైటర్లు ఆందోళన నిర్వహించారు. ఐదు రోజులుగా ధర్నా చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని డాక్యుమెంట్ రైటర్ల్ ఆవేదన వ్యక్తం చేశారు. నూతన స్లాట్ బుకింగ్ విధానాన్ని రద్దు చేయాలంటూ డాక్యుమెంట్ రైటర్లు తమ కార్యాలయాలను మూసేశారు. ఈ సందర్భంగా డాక్యుమెంట్ రైటర్లు ఎస్ఎం శ్రీనివాస్, కె.గిరిబాబు, లైఖ్‌ఉల్లాహ్, అశోక్, పులిరాజు, ఈశ్వర్, రాజు, జ్ఞానేశ్వర్, సురేష్ యాదవ్, జి.అబ్బయ్య, మొగులు రమేష్, రాంపల్లి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడారు.

◆ ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ విధానంతో తమకు గిరాకీ లేకుండా పోయిందన్నారు. ఈ విధానం ఇలాగే కొనసాగిస్తే భవిష్యత్‌లో తమకు ఉపాధి లేకుండా పోతుందన్నారు. డాక్యుమెంట్ రైటర్లను బతకకుండా చేయడమే ప్రభుత్వం లక్ష్యంగా కనిపిస్తోందని ఆరోపించారు. రిజిస్ట్రేషన్ల విషయంలో పాత విధానాన్ని కొనసాగించాలని నూతన స్లాట్‌బుకింగ్ సిస్టమ్‌ను రద్దు చేయాలని సబ్‌రిజిస్ట్రార్ మల్లికార్జున్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో డాక్యుమెంట్ రైటర్లు సునీల్, అబ్బయ్యగౌడ్, రూపదేవి, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.



చిక్కడపల్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న డాక్యుమెంట్ రైటర్లు

పక్కా ఇళ్లు కట్టిస్తాం

సంజయ్‌గాంధీనగర్ బస్తీవాసులకు హామీ ఇచ్చిన ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్



ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్‌ను కలిసి వినతి పత్రం అందజేస్తున్న బస్తీవాసులు

కాచిగూడ: గోల్నాక డివిజన్ సంజయ్ గాంధీనగర్ బస్తీలో హౌసింగ్ కార్పొరేషన్ క్వార్టర్స్ పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోననే క్వార్టర్స్ వాసులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల క్వార్టర్స్ బాల్కనీ రేయిలింగ్ కూలి ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ విషయాన్ని స్థానిక ఎంపీ, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలేరు వెంకట్‌రెడ్డి, కార్పొరేటర్లు దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్, కన్నె ఉమా రమేష్ యాదవ్ పలువురు నేతల దృష్టికి తీసుకువెళ్లి తమ సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేసినట్లు బస్తీ ప్రజలు తెలిపారు. శనివారం బస్తీ నాయకుడు మీసాల శివకుమార్ నేతృత్వంలో ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్‌ను కలిసి బస్తీలో క్వార్టర్స్‌ను కూల్చివేసి అక్కడ నూతనంగా క్వార్టర్స్ కట్టించాలని వినతి పత్రం అందజేశారు. సమస్యను సీఎం, మంత్రుల దృష్టికి తీసుకెళ్లి క్వార్టర్స్ కట్టించే విధంగా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకొని తమ ఆరోగ్యలను కాపాడుకోవాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. వీఎస్‌టీ పార్కులో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కందూరు కృష్ణ ఆధ్వర్యంలో అపోలో ఆసుపత్రి సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఠాగోపాల్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నడక, వ్యాయామంతో వ్యాధులు బారిన పడే అవకాశం ఉండదన్నారు. వ్యాధుల బారిన పడితే అదుపు చేయవచ్చన్నారు. అప్పుడప్పుడు స్వచ్ఛంద సంస్థలు నిర్వహించే ఉచిత వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



వీఎస్‌టీ పార్కులో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ఈ కార్యక్రమంలో యువజన నాయకులు ముఠా జైసింహ, శంకర్ ముదిరాజ్, ముచ్చకుర్తి ప్రభాకర్, ముదిగొండ మురళి తదితరులు పాల్గొన్నారు.

'దేశభక్తి, అభ్యుదయ గీతాలు మార్పును తీసుకొస్తాయి'



సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఉచిత పాటల శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న నలిని, శ్రీదేవి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం, సుందరయ్య విజ్ఞాన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఎస్వీ కేంద్రంలో చిన్నారుల ప్రతిభను ప్రోత్సహించేందుకు ఉచిత పాటల శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ మ్యూజిక్ ఆర్టిస్ట్ నలిని, శ్రీదేవి మాట్లాడుతూ.. పాటలోని ప్రాణవాయువును కాపాడటానికి ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. దేశభక్తి, అభ్యుదయ గీతాలు పిల్లల్లో మంచి మార్పును తీసుకొస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో టీపీఎస్కే అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు, గౌరవ అధ్యక్షుడు జి. రాములు, కొండల్‌రావు, కె.రాధిక, అల్లూరి వినయ్, జయవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రవాణ రంగంలో ఉన్న ప్రతి డ్రైవర్‌కు ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని రవాణరంగ డ్రైవర్ కార్మికుల సంక్షేమ బోర్డు సాధన సమితి డిమాండ్ చేసింది. శనివారం సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విగౌడ్, కోడ సతీష్ కార్మిక శాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రాష్ట్ర రవాణశాఖ లెక్కల ప్రకారం నైపుణ్య కలిగిన కార్మికులు 12 లక్షల మంది ఉన్నారన్నారు. వీరి మీద ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలు 60 లక్షలు ఉన్నాయని తెలిపారు. డ్రైవర్ కార్మికుల ప్రమాదాల శాతం అధికమని, మరణాల శాతం కూడా ఎక్కువగా ఉందన్నారు. ఈ ప్రమాదాల్లో ప్రాణాలు పోతే కార్మికుల కుటుంబాలు రోడ్డున పడుతున్నారని తెలిపారు. డ్రైవర్లకు ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. డ్రైవర్ కార్మిక సంఘాలతో ప్రభుత్వం చర్చలు జరిపాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్మిక శాఖ సంయుక్త కమిషనర్ చంద్రశేఖర్‌కు సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజుగౌడ్, కొండల్ రెడ్డి, మహేష్ ముదిరాజ్, తిరుపతి యాదవ్, స్వామి ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



కార్మిక శాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న డ్రైవర్ కార్మికుల సంక్షేమ బోర్డు సాధన సమితి

కంప్యూటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

ముషీరాబాద్: టెక్ మహేంద్రా ఫౌండేషన్, అప్సా స్వచ్ఛంద సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో యువతకు కంప్యూటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నామని అప్సా ప్రోగ్రామ్ మేనేజర్ షేక్‌మౌలా తెలిపారు. శనివారం రాంనగర్‌లో కంప్యూటర్‌లో ఉచిత శిక్షణపై అవగాహన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కంప్యూటర్‌తో పాటు టెలి కమ్యూనికేషన్, ఇంగ్లిష్ టైప్ రైటింగ్, ఇంటర్వ్యూ స్కిల్స్ తదితర రంగాలలో శిక్షణ ఇవ్వడంతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టెక్ మహేంద్రా ఫౌండేషన్, అప్సా ప్రతినిధులు భాస్కర్, జయశ్రీ, చందన, మేఘన తదితరులు పాల్గొన్నారు.

'తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉంటుంది'



సచ్చిదానంద సరస్వతిస్వామిని కలిసిన మంత్రి కొండా సురేఖ, బ్రాహ్మణ ప్రతినిధులు

నల్లకుంట: తాండవ పీఠం పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతిస్వామి నగరంలో విడిది చేశారు. విషయం తెలుసుకున్న దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, బ్రాహ్మణ సేవా సంస్థ ప్రతినిధి సీహెచ్. మురళీకృష్ణ, బీటీపీడబ్ల్యూఏ ప్రధాన కార్యదర్శి వింజమూరి సుధాకర్ శనివారం పీఠాధిపతిని కలిశారు. ఈ సందర్భంగా సచ్చిదానంద సరస్వతిస్వామి వారిని ఆశీర్వదించి తెలంగాణ సుభిక్షంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

దండోరా నేతల త్యాగాల ఫలితమే వర్గీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ: దండోరా నేతల త్యాగాల వల్లే ఎస్సీ వర్గీకరణ రిజర్వేషన్ల కల సాకరమయ్యిందని మాదిగ దండోరా ఉద్యమకారుల వేదిక చైర్మన్ డా.రుద్రవరం లింగస్వామి మాదిగ పేర్కొన్నారు. ఏపీ, తెలంగాణ రెండు తెలుగు రాష్ట్రాల్లో వర్గీకరణకు రెండు ప్రభుత్వాలు జీవో నంబర్. 19, జీవో 33 జారీ చేసి అమలు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్సీ వర్గీకరణలో ఓయూ విద్యార్థులు, అధ్యాపకుల పాత్ర కీలకమని ఉద్యమానికి మొదటి నుంచి వెన్నుదన్నుగా నిలచిన ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొ.కాశీం, చీఫ్ వార్డెన్ డా.కొర్రెముల శ్రీనివాస్ రావుకు శనివారం ఆయన స్వీట్లు తినిపించి కృతజ్ఞతలు తెలిపారు.

'కులగణన ఎక్స్-రే లాంటిది'

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కులగణన ఎక్స్-రే లాంటిదని కానీ మనకు ఎంఆర్ఐ స్కానింగ్ కావాలని రాజకీయ తత్త్వవేత్త ప్రొ. యోగేంద్ర యాదవ్ అన్నారు. ఓయూ ఆర్ట్స్ కాలేజీ పొలిటికల్ సైన్స్ విభాగం సెమినార్ హాల్‌లో ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ నేత మహేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో శనివారం కుల గణన రిజర్వేషన్లు, సామాజిక న్యాయం అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ ఐఏఎస్ చిరంజీవులు, ఢిల్లీ వర్సిటీ ప్రొ.సుకుమార్, డా.పరందాములు తదితరులు హాజరై బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు, ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల ఐక్యత తదితర అంశాలపై ప్రసంగించారు.

'లాల్.. నీల్' శక్తులు ఏకం కావాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సామాజిక అసమానతలు లేని రాజ్యస్థాపనే మహమ్మద్ గౌస్‌కు ఇచ్చే నిజమైన నివాళి అని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాదగోని రవి అన్నారు. శనివారం బాగ్‌లింగంపల్లి ఓంకార్ భవన్‌లో ఆ పార్టీ హైదరాబాద్ జిల్లా ఆధ్వర్యంలో దివంగత ఎంసీపీఐయు జాతీయ ప్రధాన కార్యదర్శి ఎండీ గౌస్ నాల్గో వర్ధంతి సభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలాలు వేసి నివాళులర్పించారు. అనంతరం గాదగోని రవి మాట్లాడుతూ.. కుల వ్యవస్థను నిర్మూలన చేయకుండా సామాజిక అసమానతలు సాధించలేమన్నారు. అందుకోసం 'లాల్.. నీల్'శక్తులు ఏకం కావాలనే పిలుపునిచ్చారు. అగ్రవర్ణ బ్రహ్మణీయ పాలను తుదముట్టించాలంటే బహుజన శక్తులు రాజ్యాధికారాన్ని చేపట్టాలన్నారు.



ఓంకార్ భవన్‌లో జరిగిన ఎండీ గౌస్ వర్ధంతి సభలో మాట్లాడుతున్న గాదగోని రవి

ఆ పార్టీ నాయకులు గాదే మల్లేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వనం సుధాకర్, ఎం.రమేష్, తుడుం అనిల్ కుమార్, తుకారం నాయక్, తాండ్ర కళవతి తదితరులు పాల్గొన్నారు.

ఏసుప్రభు చూపిన బాటలో నడుచుకోవాలి

ముషీరాబాద్: ఏసుక్రీస్తు నేర్పిన సేవా, దయా, మానవాలికి స్ఫూర్తి దాయకం అని బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ అన్నారు. శనివారం వివిధ చర్చ్‌ల నుంచి ఈస్టర్ పర్వదినం సందర్భంగా క్రైస్తవులు ఐక్యతను ఆకాంక్షిస్తూ ర్యాలీ నిర్వహించారు. ముషీరాబాద్, పార్శీగుట్ట, రాంనగర్, వీఎస్‌టీ, ఇందిరాపార్కు నుంచి అబిడ్స్‌లోని సేయింట్ జాన్స్ కళాశాల వరకు నిర్వహించారు. ఈ ర్యాలీని బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ... క్రీస్తు బోధనలు అనుసరిస్తూ ప్రపంచ శాంతికి దోహదపడాలన్నారు. ఈ సందర్భంగా చర్చ్ ఫాస్టర్‌లు మరిదాస్, ప్రేమ్‌కుమార్ తదితరులు బైబిల్‌లోని దైవ సందేశాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవ సంఘాల నేతలు డెనియల్, గోని సాల్వాన్, జయకుమార్, ఆర్.మోజేస్, టోని, జాయ్, భాస్కర్, ప్రేమ్‌సాగర్, రాంనగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు శంకర్‌ముదిరాజ్, కృపావరం తదితరులు పాల్గొన్నారు.



శాంతిర్యాలీలో పాల్గొన్న బీఆర్ఎస్ యువనాయకుడు ముఠా జైసింహ, వివిధ చర్చ్‌ల పాస్టర్లు

బడీడు పిల్లలను పాఠశాలలకు పంపాలి



భోలక్‌పూర్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీయూ అధికారి శ్రీనివాస్

ముషీరాబాద్: బడీడు పిల్లలు పెడదారి పట్టకుండా తప్పనిసరి పాఠశాలలకు పంపించాలని డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్(డీసీపీయూ) ఎం.శ్రీనివాస్ అన్నారు. శనివారం భోలక్‌పూర్ డివిజన్ సిద్ధిఖ్‌నగర్‌లో రెయిన్‌బో కమ్యూనిటీ కేర్ ఆధ్వర్యంలో చైల్డ్ ప్రొటెక్షన్ కమ్యూనిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా శ్రీనివాస్ హాజరై మాట్లాడుతూ... చిన్నారులను పనికి పంపడం నేరమని అన్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు వాటర్ బాటిల్స్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీబీసీ ప్రోగ్రామ్ మేనేజర్ క్రాంతికిరణ్, నాయకులు మున్వర్‌చాంద్, మగ్దూమ్, ఆజీపాషా, షకీల్ అహ్మద్, పర్వేజ్ కురేషి, ఎస్ఆర్‌డీ సంస్థ ప్రతినిధులు శివరాణి, ఇందిరాభారతి తదితరులు పాల్గొన్నారు.

'కవిత్వం మనిషిని ఉన్నతీకరిస్తుంది'

సుందరయ్య విజ్ఞాన కేంద్ర: వెన్నెల పిట్ట ప్రచురణ సంస్థ ఆధ్వర్యంలో యువ రచయిత బాలు అగ్నివేష్ రచించిన సూక్ష్మజీవి కవితల సంపుటిని బాలు తల్లిదండ్రులు శంకర్, లత ఆవిష్కరించారు. శనివారం రాత్రి ప్రముఖ కవి యాకుబ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. కవిత్వం మనిషిని ఉన్నతీకరిస్తుందని అన్నారు. యువతరం కవిత్వంలోకి రావడం ఆశాజనకమని పేర్కొన్నారు. సమాజంలో నెలకొన్న అసమానతలు ఈ కవితల్లో చోటు చేసుకున్నాయని కితాబిచ్చారు. యువత సమాజాన్ని పట్టించుకోవడం లేదనే అపవాదను ఈ పుస్తకం పూర్వపక్షం చేస్తుందన్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన నరేష్‌కుమార్ సూఫీ మాట్లాడుతూ.. చిన్న వయసులో గొప్ప కవిత్వాన్ని అలతి పదాలతో బాలు రాయడం అభినందనీయమని అనన్నారు. మన చుట్టూ ఉండే అనేక సమస్యల దగ్గర నుంచి గాజా వరకు విస్తృతంగా రాశారని తెలిపారు. వక్తలు రోజారాణి, వేణు మాట్లాడుతూ... ఈ కవితలు వాస్తవికతకు నిలువుటద్దమని పేర్కొన్నారు.



సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సూక్ష్మజీవి కవితల సంపుటిని ఆవిష్కరిస్తున్న ప్రముఖ కవి యాకుబ్